క్లుప్తంగా

విద్యావ్యవస్థలో మార్పులకు శ్రీకారం

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



వినుకొండ(నూజెండ్ల): మండలంలోని చీకటీగలపాలెం గ్రామంలో గల ఏపీ మోడల్ స్కూల్, నూజెండ్ల మండలం ఉప్పలపాడు గ్రామంలోని బాలికల గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు శనివారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానేత వై.ఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చి ఎంతోమంది ఉన్నత చదువులు చదివేందుకు దోహదపడ్డారని, అదే బాటలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రతి ఏటా విద్యారంగానికి బడ్జెట్‌లో వేల కోట్లు కేటాయిస్తున్నారని అన్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని వనరులను ప్రభుత్వం సమకూరుస్తుందని అన్నారు. నియోజకవర్గంలో మొత్తం 3 వేల మంది విద్యార్థులకు ట్యాబ్‌లను అందించనున్నట్లు తెలిపారు. ప్రతిపక్షం వారు ఇంగ్లిష్ విద్య పేదలకు అందించకూడదనే ఉద్దేశంతో కోర్టులకు వెళ్లడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

శనగలో రసాయనాలు వాడొద్దు

చిలకలూరిపేటటౌన్: శనగ పంట పొలాలకు అధిక రసాయాలు వాడటం వల్ల భూసారం దెబ్బతిని మొక్కలకు మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోతాయని ప్రకృతి వ్యవసాయ డివిజన్ ఇన్‌చార్జి ఎంటీ మనోజ్ కుమార్ చెప్పారు. సోమ వారం మండలంలోని దండమూడి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న శనగ పంట పొలాలను ఆయన ఎంసీఆర్‌పీ ఐలయ్య, పీఆర్‌పీ భాస్కర్‌తో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసారాన్ని పెంచుకోవడానికి మేలు చేసే సూక్ష్మ జీవులను కాపాడుకోవాలన్నారు. పచ్చ పురుగు నివారణకు అగ్ని అస్త్రం తయారు చేసి రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ మధువని, రామకోటేశ్వరరావులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

బొల్లాపల్లి: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మండలంలోని వెల్లటూరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఇరువురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో మాదలలో జరిగిన స్కూల్ గేమ్స్ కబడ్డీ పోటీలకు అండర్-14, అండర్-17 జట్లకు సంబంధించి పాఠశాలకు చెందిన భూక్యా పవన్‌నాయక్, మేరాజోత్ హనుమానాయక్‌లు పోటీలకు ఎంపికయ్యారు. వీరు రాష్ట్రస్థాయిలో ఈ నెల 7,8,9 తేదీల్లో విజయనగరంలో జరిగే కబడ్డీ పోటీలకు పాల్గొంటారని ఈ మేరకు పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం బి.నాగేశ్వరరావు, పీడీ బి.శ్రీనివాసరావులు తెలిపారు. ఇరువురు విద్యార్థులను తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఎం.గురునాథం, సర్పంచ్ మైలా చినవీరయ్య, మాజీ సర్పంచ్ కె.లక్ష్మీనారాయణతో పాటు హెచ్‌ఎం, పీడీలు, ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్రస్థాయిలో పాఠశాలకు ఆటల పోటీల్లో పేరుప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

క్రీడాభివృద్ధికే ఇండోర్ స్టేడియం

వినుకొండ టౌన్: వెనుకబడిన వినుకొండ ప్రాంతంలో విద్యాభివృద్ధితోపాటు క్రీడాభివృద్ధికి ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేశామని పట్టణ శివారులోని గుడ్ షెఫర్డ్ స్కూల్ డైరక్టర్ గోపు ఇన్నారెడ్డి పేర్కొన్నారు. ఆల్ ఇండియా బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు కలకత్తా వెళు తున్న విద్యార్థుల అభినందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన విద్యార్థుల ను అభినందించి మాట్లాడుతూ ఇండోర్ స్టేడి యం ఏర్పాటు చేసి నాలుగు వసంతాలు పూర్త య్యాయన్నారు. ఈ నాలుగు సంవత్సరాల కాలంలో మూడుజిల్లా స్థాయి టోర్నమెంట్లను, రెండు రాష్ట్ర స్థాయి టోర్నమెంట్లను నిర్వహించడమే కాకుండా క్రీడాభివృద్ధిలో భాగంగా నెల వారీ టోర్నమెంట్లు నిర్వహిస్తున్నామన్నారు. బ్యాడ్మింటన్ క్రీడలో ఆల్ ఇండియా టోర్నమెంట్‌లో ఆడేందుకు ఇద్దరు విద్యార్థులు కలకత్తా వెలుతుండటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. క్రీడల్లో నైపుణ్యం కనబరుస్తున్న పేద విద్యార్థులకు తమవంతు ఉచితంగా శిక్షణనిస్తున్నామన్నారు. అంతేకాకుండా ఈ విద్యా సంవత్సరంలో తమ పాఠశాల విద్యార్థులు ఇటీవల నిర్వహించిన క్రీడల్లో తిరుమలాంబిక బ్యాడ్మింటన్ క్రీడలో ప్రతిభ కనబరచగా కిరణ్, నాగరాజులు కోకో క్రీడలో, దినేష్ వాలీ బాల్ క్రీడలో, అమీర్ సాయి సాఫ్ట్ బాల్ క్రీడలో, విష్ణువర్ధన్ కబడ్డీ క్రీడలో ప్రతిభ కనబరిచి పోటీలకు ఎంపిక య్యారన్నారు. జిల్లా స్థాయిలో ఆరుగురు, రాష్ట్ర స్థాయిలో 13 మంది, జాతీయ స్థాయిలో ముగ్గురు రాణించారన్నారు. తమ పాఠశాలలో అధునాతన విద్యావిధానాన్ని ప్రవేశపెట్టామని అందులో భాగంగా విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో తర్ఫీదు ఇస్తున్నామన్నారు. విద్యార్థుల మానసిక వికాసం కోసం క్లాసికల్ డాన్స్, కరాటే, యోగా క్లాసులు నిర్వ హిస్తున్నామన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ సునీత, పాఠశాల డైరెక్టర్లు కిరణ్, మదన్, మంజులతో కలిసి విద్యార్థులను, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు అజీమ్, వెంకటేశ్వర్లు, నాగరాజు, వెంకటేష్, సుబ్రహ్మణ్యంలను ఆయన అభినందించారు.

అవ్వా-తాతల మోముల్లో సంతోషం

- పెంచిన పింఛన్లతో లబ్ధిదారులకు మేలు
- వైద్య ఆరోగ్య శాఖమంత్రి విడదల రజిని



బూదమ్మకు పింఛను సొమ్ము అందిస్తున్న మంత్రి విడదల రజిని



లబ్ధిదారులతో కలిసి జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మంత్రి విడదల రజిని

నాదెండ్ల: తన సుదీర్ఘ పాదయాత్రలో అవ్వాతాతల కష్టాలను దగ్గరుండి చూసి వారి అవస్థలను రూపుమాపాలని తలంచి ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చాక అమలు చేసిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిఇంటికి పెద్దకొడుకని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పల్నాడు జిల్లా నాదెండ్ల మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వైఎస్సార్ పెన్షన్ కానుక పథకంలో పెంచిన నగదుతో కలిపి పెరిగిన పెన్షన్ మొత్తాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పెన్షన్ కానుకపై వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎంపీపీ తలతోటి రాణి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో రాష్ట్రంలో 39 లక్షల పెన్షన్‌దారులుండగా, నేడు ప్రభుత్వం 62 లక్షలకు మంది పైబడి లబ్ధిదారులకు పెన్షన్‌ను అందిస్తున్నదని చెప్పారు. గతంలో పింఛన్ కావాలంటే జన్మభూమి కమిటీ సభ్యుల ప్రసన్నం కోసం లబ్ధిదారులు ఇక్కట్లు పడేవారన్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ పెన్షన్ నగదు చేతికందాలంటే చాంతాడంత క్యూలో నిలుచుని నీరు నీడ లేక అవస్థలు పడేవారన్నారు. పెన్షన్ సొమ్ము కోసం పాట్లు పడేవారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఎలాంటి వివక్ష లేకుండా వలంటీర్ల వ్యవస్థ ద్వారా అర్హులైన వారందరికీ పెన్షన్‌ను అందిస్తున్నదన్నారు. లబ్ధిదారుల ఇంటి గడప వద్దకే పింఛను సొమ్ము అందిస్తుండటంతో అవ్వా తాతలు, దివ్యాంగులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. వచ్చే ఏడాదికి రూ.3 వేల పెన్షన్ అందించనున్నట్లు చెప్పారు. పండుగైనా, ఆదివారమైన తలుపుతట్టి పెన్షన్ అందిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం నెలకు కేవలంరూ. 400ల కోట్లు మాత్రమే పెన్షన్ పంపిణీ చేయగా, ప్రస్తుత ప్రభుత్వం నెలకు అక్షరాల రూ.1786 కోట్లు పంపిణీ చేస్తు నాలుగున్నరరెట్లు ఇస్తున్నదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు, సర్పంచ్ పెరుమాళ్లపల్లి వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ఏపీ రమణ, ఎంపీడీవో జాకీర్ హుస్సేన్, ఎంఈవో ఆంజనేయులు, సీడీపీవో శాంతకుమారి, నాదెండ్ల సొసైటీ చైర్మన్ సింగారెడ్డి కోటిరెడ్డి, మాజీ ఎంపీపీ కంజుల వీరారెడ్డి, బత్తుల సీతారామిరెడ్డి, ఉపేంద్ర, ఉడతా వెంకటేశ్వరరావు, బుచ్చ య్య, గద్దె కోటయ్య, ఎంపీటీసీలు యల్లారావు, ఏసమ్మ, అంకమ్మ, మూసా, శివలక్ష్మీ నారాయణ, గుర్రం ఉపేంద్ర, రత్తయ్యపాల్గొన్నారు.

జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం

వైఎస్సార్ పెన్షన్ కానుక నగదును ఈ ఏడాది నుంచి రూ.250లు పెంచుతూ ఏకంగా జనవరి మాసం నుంచి రూ.2750లు ఇస్తుండటంతో అవ్వా తాతల ముఖంలో ఆనందం వెల్లివిరుస్తోంది. పల్నాడు జిల్లా నాదెండ్ల మండల పరిషత్ కార్యాలయం వద్ద వైఎస్సార్ పెన్షన్ కానుకలో పెంచిన మొత్తాన్ని వృద్ధులకు పంపిణీ చేస్తూ మంత్రి విడదల రజిని లబ్ధిదారుల సంతోషంలో పాలుపంచుకున్నారు. అనంతరం సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి పెన్షన్ లబ్ధిదారులతో కలిసి పాలాభిషేకం చేశారు.

కనమర్లపూడిలో....

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామ సచివాలయ పరిధిలో వైఎస్సార్ సామాజిక పింఛన్లు పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించినట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి దారివేముల రవీంద్రబాబు తెలిపారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ కోఆర్డినేటరు బోడెపూడి శ్రీనివాసరావు, సర్పంచ్ తన్నీరు జ్యోతి, మాజీ సర్పంచ్ అంకారావు, వలంటీర్లు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు

బొల్లాపల్లి: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పింఛన్ పెంపుదలలో ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నారని ఎంపీపీ బత్తి రాములు అన్నారు. మండలంలోని గుమ్మనంపాడు గ్రామంలో నూతనంగా మంజూరైన లబ్ధిదారులకు పింఛన్ అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నిమ్మల వెంకాయమ్మ, ఎంపీటీసీ వెంకటరెడ్డి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ బి.గురవయ్య, పంచాయతీ, రెవెన్యూ కార్యదర్శులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

92 శాతం పింఛన్ల పంపిణీ

నాదెండ్ల: నూతన సంవత్సరం సందర్భంగా వైఎస్సార్ పెన్షన్ కానుక మండల పరిధిలోని 16 సచివాలయాల్లో రెండో రోజు సోమవారం 92 శాతం పంపిణీ చేశారు. మండల పరిధిలో 9383 మంది పెన్షన్ దారులుకాగా, ఈ ఏడాది జనవరిలో నూతనంగా 297 మందికి పెన్షన్లు మంజూరయ్యాయి. వీరికి బుధవారం నుంచి గ్రామ సచివాలయాల వద్ద పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్ తెలిపారు.

యడ్లపాడులో...

యడ్లపాడు: తెల్లవారక ముందే ఇంటి తలుపు తట్టి అర్హులైన లబ్ధిదారులందరికీ వలంటీర్లు 18 రకాల పింఛన్లు పంపిణీ చేస్తూ ఆనందం నింపుతున్నారు. తాజాగా నూతన సంవత్సర కానుకను ముఖ్యమంత్రివై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తూ..ఈనెల నుంచి రూ.2,750కి పెంచారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ఈ మొత్తాన్ని లబ్ధిదారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పి మరీ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి అందించారు. వృద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛన్లే కాకుండా రూ.3 వేలు అందుకునే దివ్యాంగులు, హిజ్రాలు, డప్పు కళకారులు, బహుళ వైకల్య, కుష్ఠు వ్యాధిగ్రస్తులు ఉన్నారు. అలాగే డయాలసిస్, ఇతర చికిత్సల నిమిత్తం ప్రతినెలా రూ.5వేలు, రూ.10 వేలు అందుకునే వారు కూడా ఉన్నారు. టీడీపీ హయాంలో మండలంలో కేవలం 5278 మంది పింఛన్‌దారులు ఉండగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాకా మొత్తంగా పాత, కొత్త పింఛన్లు కలిపి మండలంలో 7980 మందికి రూ.2,18,25,500 పింఛన్ల రూపేణ ప్రతినెలా లబ్ధి పొందుతున్నారు.

నేడు నూతన పింఛన్ల పంపిణీ

మండలం పరిధిలో నూతనంగా మంజూరైన 262 మందికి పింఛన్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరగనుంది. యడ్లపాడు టీటీడీ కల్యాణమండలంలో ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో రాష్ట్రవైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు ఫించన్లు అందజేస్తారు.

రహదారి సమస్యపై మంత్రికి వినతి

యడ్లపాడు: హైవే సర్వీసు మార్గం సమస్యను పరిష్కరించాలంటూ యడ్లపాడు గ్రామస్తులు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజినిని కోరారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఆమెను గ్రామపెద్దలు నూతలపాటి కాళిదాసు, జరుగుల శంకర్రావు గ్రామస్తుల తరపున అర్జీని అందజేశారు. గతంలో హైవే అథారిటీ గ్రామ పరిధిలో ఆరులైన్ల రహదారుల విస్తరణలో భాగంగా రెండు వైపులా 400 మీటర్ల చొప్పున సర్వీసు మార్గాన్ని వివిధ కారణాలతో పూర్తి చేయలేదన్నారు. దీంతో హైవేపైకి పాదాచారులు, పశువులు రావల్సి వస్తున్నందున, ప్రమాదాలు జరిగే అస్కారం ఉందని చెప్పారు. గతంలో జరిగినవి మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.



గణపవరంలో వలేటి రమణమ్మకు పెన్షన్ అందిస్తున్న వలంటీర్ అచ్చి గురవయ్య



బొల్లాపల్లిలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న ఎంపీపీ, సర్పంచ్

ఇది బడుగు, బలహీనవర్గాల ప్రభుత్వం

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ప్రభుత్వం తమదేనని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. వినుకొండ పట్టణంలోని 9 వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి తెలియజేశారు. అనంతరం ప్రజలనుద్దేశించి ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. చంద్రబాబు ప్రచారం కోసం అమాయకప్రజలను పొట్టన పెట్టుకుంటున్నారని, ఇటీవల కాలంలో కందుకూరు సభలో 8 మంది, గుంటూరులో ముగ్గురు మృతికి కారకులయ్యారని, అసత్యప్రచారాలు చేసి అమాయక ప్రజలను ఆకర్షించేందుకు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు తెల్లాకుల రాజేష్‌ఖన్నా, బేతం గాబ్రియేలు, వార్డు కౌన్సిలర్లు రెడ్డి నాగపద్మ, పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

జగనన్న పాలనలో కుటుంబాల్లో ఆర్థికాభివృద్ధి

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి చెందుతోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖామంత్రి విడదల రజిని చెప్పారు. పట్టణంలోని 17 వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ ప్రతి కుటుంబం బాగుపడేలా సంక్షేమ పథకాలను కులం, ప్రాంతం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికి ప్రభుత్వం అందజేస్తున్నదని వివరించారు. సామాజిక తనిఖీల ద్వారా లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేసి వారికి ఆయా పథకాలను అందజేస్తున్నదని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వార్డు కౌన్సిలర్ పుల్లగూర అనురాధ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, నాయకులు పుల్లగూర భరత్, గుంజి వీరాంజనేయులు, పొనుగుపాటి మోషే, ఊసా రమేష్, షేక్ ఖాదర్ జిలాని, పల్లపు అంకమ్మ, శివ తదితరులు పాల్గొన్నారు.



పథకాల పత్రాలను అందజేస్తున్న మంత్రి రజిని

ఘనంగా ముక్కోటి ఏకాదశి



వినుకొండలో ఆలయ ప్రాంగణంలో పూలతో ఏర్పాటు చేసిన గోవిందుడు



రొంపిచర్లలో సంజీవ ఆంజనేయస్వామి వారు



గణపవరంలో ప్రత్యేక అలంకరణలో స్వామివార్లు



వేల్పూరులో ప్రత్యేక అలంకరణలో స్వామి వారి మూలవిరాట్

నరసరావుపేట ఈస్ట్: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని సోమవారం పట్టణంలోని వైష్ణవాలయాలలో వైభవంగా నిర్వహించారు. స్వామివారు గరుడవాహనంపై ఉభయ దేవేరులతో కలసి ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిచ్చి అనుగ్రహించారు. ఆలయాలను పుష్పమాలికలతో అలంకరిచారు. ఉదయం ఐదు గంటల నుండే స్వామివారి దర్శనానికి ఆయా ఆలయాల వద్ద బారులుతీరారు. బరంపేటలోని శ్రీరాధ గోవింద చంద్ర మందిరం ఇస్కాన్ ఆలయంలో రాధగోవిందులు శ్రీవేంకటేశ్వరస్వామి, ఆండాళ్ అమ్మవారిగా, శ్రీపాండురంగస్వామి ఆలయంలో శేషతల్పంపై శయనించిన శ్రీమహా విష్ణువుగా దర్శనమిచ్చారు.

యడ్లపాడులో...

యడ్లపాడు: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చెంఘీజ్‌ఖాన్‌పేట వెన్నముద్దల బాలకృష్ణుని పురాతన ఆలయం, సొలస గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీభూసమేత రంగనాయకస్వామి ఆలయం, బోయపాలెం శ్రీపార్వతిదేవి ఆలయంలో స్వామివార్లకు ప్రత్యేక పుష్పాలతో అలంకరణలు చేశారు.

లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో..

చిలకలూరిపేట: ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని పట్టణంలోని కొమరవల్లిపాడులో ఉన్న శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ పూజల్లో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి విడదల రజిని పాల్గొని పూజలు నిర్వహించారు.

రూరల్ పరిధిలో....

నరసరావుపేట రూరల్: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని సోమవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని శ్రీవారి ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించి ఉత్తర ద్వార దర్శనాన్ని భక్తులకు కల్పించారు. ఉప్పలపాడు జ్ఞానసరస్వతి ఆలయంలో క్షేత్రపాలకుడైన శ్రీ మహావిష్ణువును ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున 5 గంటల నుంచే ఉత్తర ద్వారా దర్శనానికి భక్తులు పోటెత్తారు. గణపవరం శాంతినగర్‌లోని కోదండరామాలయంలో వేడుకలు ఘనంగా జరిగాయి. పూజారులు బులెబ్బాయి, రంగారావులు విశేష పూజలు, సహస్ర నామార్చన నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఇదేగ్రామంలోని రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి, మండల కేంద్రమైన నాదెండ్లలో కొండపై కొలువైయున్న కోదండ రామాలయంలో వేడుకలు ఘనంగా జరిగాయి.

వినుకొండలో...

వినుకొండ టౌన్: ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా పట్టణంలోని శ్రీనివాస నగర్‌లో వేంచేసి యున్న అలివేలు మంగా పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వేడుకలను కమిటీ సభ్యులు సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు రెడ్డి బంగారయ్య, ప్రధాన కార్యదర్శి అచ్యుత కృష్ణ, సుబ్బారావు, కోశాధికారి కాళ్ళ రామ కోటేశ్వరరావు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

శావల్యాపురంలో..

శావల్యాపురం: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని శావల్యాపురం, పోట్లూరు, వేల్పూరు, మతుకుమల్లి, కారుమంచి కనమర్లపూడి తదితర గ్రామాల్లో సోమవారం భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. కారుమంచి గ్రామంలో వేంచేసి యున్న శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో వేడుకలు వైభవంగా నిర్వహించారు.

నూజెండ్లలో...

వినుకొండ(నూజెండ్ల): ముక్కోటి వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా నూజెండ్ల గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ రాజ్యలక్ష్మీ సమేత చెన్నకేశవస్వామి దేవస్థానంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

రొంపిచర్లలో....

రొంపిచర్ల: మండలంలో ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. వేకువజాము నుంచే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి వైష్ణవ ఆలయాలకు వెళ్లి దేవతా మూర్తులను ఉత్తరద్వారం గుండా దర్శించుకున్నారు. అన్ని గ్రామాల్లోని రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి.

'జగనన్న బడుగు వికాసం'తో అర్హులకు తోడ్పాటు

నరసరావుపేట: జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న బడుగు వికాసం' కార్యక్రమం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి ఉపాధి రంగాల్లో అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ ఎల్.శివ శంకర్ పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా బ్యాంకు సబ్సిడీపై బొలేరో కారు పొందిన నకిరేకల్ మండలానికి చెందిన రమావత్ నరేష్ నాయక్‌కు సోమవారం కలెక్టరేట్ ఎదుట కారు ప్రారంభించి తాళాలు అందజేశారు. దీనిపై నోడల్ అధికారి సంజీవరావు వివరాలను తెలియచేస్తూ గత ఏడాది సెప్టెంబర్ 14న తొలిసారిగా నిర్వహించిన నవోదయం కార్యక్రమం ద్వారా డ్రైవర్‌గా పనిచేస్తున్న నకిరేకల్ మండలానికి చెందిన రమావత్ నరేష్‌నాయక్ తన జీవన విధానంలో మార్పు కోసం కారు కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. నరేష్ నాయక్ నకిరేకల్ మండల యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకర్లతో సమావేశమై దరఖాస్తు పత్రాలను అందజేశారన్నారు. దరఖాస్తును పరిశీలించిన జిల్లా కలెక్టర్ 45 శాతం సబ్సిడీ (రూ.6 లక్షల) విడుదలకు సంసిద్ధత వ్యక్తం చేశారన్నారు. మొత్తం బొలేరో వాహనం ధర రూ.13.16 లక్షలు ఉండగా, లబ్ధిదారుని వాటా సుమారుగా 2 లక్షలు బ్యాంకులో జమ చేసి తద్వారా వాహనాన్ని కొనుగోలు చేశారన్నారు. లబ్ధిదారుడు నరేష్ నాయక్‌తో పాటు నోడల్ అధికారి సంజీవరావు, బ్యాంకర్లను జిల్లా కలెక్టర్ అభినందించారు.



కారు తాళాలను లబ్ధిదారునికి అందజేస్తున్న కలెక్టర్ శివశంకర్

పేద మహిళలకు చీరల వితరణ

బొల్లాపల్లి: క్రీస్తు సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మండలంలోని అయ్యన్నపాలెం గ్రామంలో 35 మంది పేద మహిళలకు వితరణగా చీరలు పంపిణీ చేసినట్లు సంఘం నిర్వాహకులు మాచర్ల ప్రకాష్‌బాబు సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన డి.ప్రదీప్ ప్రతిఏటా వృద్ధులు, వికలాంగులు, వితంతు మహిళలకు ఉచితంగా తనవంతు చీరలు అందచేస్తారని చెప్పారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

104 సేవలు కొనసాగించాలి

శావల్యాపురం: మండలంలోని పొట్లూరు గ్రామ పంచాయతీ శివారు గ్రామమైన కృష్ణాపురం గ్రామంలో 104 వాహన వైద్య సేవలు పునరుద్ధరించాలని గ్రామస్తులు లిఖితపూర్వకంగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీంకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ 104 వాహన వైద్య సేవలు గత మూడు నెలల నుంచి నిలుపుదల చేయటం వలన 50 సంవత్సరాల దాటిన వయోవృద్ధులు వివిధ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారందరు తీవ్రస్థాయిలో ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే 104 వాహన వైద్య సేవలు అందించేలా తగు చర్యలు చేపట్టాలన్నారు.

ఫ్లోరోసిస్ బాధితులకు వీల్‌చైర్లు

శావల్యాపురం: రెడ్ క్రాస్ సొసైటీ, రోటరీ క్లబ్ వారు సంయుక్తంగా ఫ్లోరోసిస్ బాధితురాలకు 11 మందికి వీల్‌చైర్లు వితరణ చేసినట్లు మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీం సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి మాట్లాడుతూ పల్నాడు జిల్లా కలెక్టరు సారథ్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లో ఫ్లోరిసిస్ బారిన పడి నడవలేని స్థితిలో ఇబ్బందులు పడుతున్న వారికి చేయూతగా వీల్ చైర్లు దాతలు వితరణ చేసినట్లు చెప్పారు. గ్రామ సచివాలయ పరిధిలో అర్హులు ఉంటే గుర్తించాలని ఆరోగ్య కార్యకర్తలకు సూచించామన్నారు. ఆయనతో పాటు స్టాఫ్‌నర్సు బాలిబోయిన లక్ష్మిప్రసన్న తదితరులు ఉన్నారు.

నరేష్‌పై చర్యలు తీసుకోవాలంటూ వినతి

నరసరావుపేట: హిందువుల ఆరాధ్య దైవములైన శ్రీ అయ్యప్పస్వామి, సదాశివుడు, విష్ణుమూర్తులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తెలంగాణాకు చెందిన బైరి నరేష్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుని పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేయాలని హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్వో డి.వినాయకంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐవీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఏ.సుబ్బారావు, సనాతన హిందూ ధర్మవాసులు, హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు మనోజ్, విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్, హైందవ సైన్యం, కృష్ణధర్మరక్షణ నాయకులు ఏ.శివకుమార్, నరసింహారావు, గుప్తా, శివ, మనుదీప్ పాల్గొన్నారు.

దర్శకుడు కాటా సుబ్బారావు కన్నుమూత

నాదెండ్ల: సినీ, రంగస్థల నటుడు, రచయిత, దర్శకుడు కాటా సుబ్బారావు (68) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఏడాది కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. కొద్దిరోజుల నుంచి గుంటూరు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆసుపత్రిలోనే తుదిశ్వాస విడిచాడు. పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం గణపవరం గ్రామానికి చెందిన కాటా సుబ్బారావు ఐదు నాటికలు పైగా రచించి దర్శకుడిగా పనిచేశారు. ఐదు సినిమాలకు దర్శకుడిగా పని చేయటమే కాక, పలు సినిమాల్లో నటించారు. ఆయనకు భార్య, ఇరువురు కుమారులు ఉన్నారు. కుమారులు రాజేష్, గౌతమ్‌లు సినీ రంగంలోనే పనిచేస్తున్నారు. మంగళవారం స్వగ్రామమైన గణపవరంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

క్రైం వార్తలు...

అనుమానంతో వ్యక్తిపై దాడి

నాదెండ్ల: తనకు చేతబడి చేశాడన్న అనుమానంతో కత్తితో వ్యక్తిపై దాడికి పాల్పడిన సంఘటన మండలంలోని నాదెండ్ల గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... నాదెండ్ల గ్రామానికి చెందిన కుందుర్తి వెంకటరమణ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. వీరి యింటికి సమీపంలో నివశిస్తున్న శీలం సాంబయ్య తనను వెంకట రమణ కొద్దిరోజుల క్రిందట చేతబడి చేశాడని అనుమానం పెంచుకున్నాడు. ఆదివారం రాత్రి ఇరువురు మద్యం సేవించగా, మద్యం మత్తులో తన వెంట తెచ్చుకున్న కత్తితో వెంకట రమణపై దాడి చేశాడు. దీంతో గాయాలపాలైన క్షతగాత్రుడిని కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని...

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్ల సమీపంలో నార్కెట్‌పల్లి, అద్దంకి రహదారిపై సోమవారం గుర్తుతెలియని వాహనం ఢీకొని కర్లకుంట గ్రామానికి చెందిన వల్లెపు శ్రీరాములుకు తీవ్రగాయాలయ్యాయి. రొంపిచర్లలో పనులు చూసుకుని ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా వెనుకవైపు నుండి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రగాయాలైన శ్రీరాములను 108 వాహనంలో నరసరావుపేటకు తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ సురేష్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను అక్కడి వారిని అడిగి తెలుసుకున్నారు.

యువకుడి ఆత్మహత్య

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం గ్రామానికి చెందిన చీమల వేమారెడ్డి పొలంలో పురుగు మందు తాగి సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. వేమారెడ్డి విప్పర్ల రెడ్డిపాలెం గ్రామ సమీపంలో ఉన్న పొలంలోకి వెళ్లి పురుగు మందు తాగి మృతి చెంది ఉండటాన్ని గ్రామస్తులు సోమవారం కనుగొన్నారు. వేమారెడ్డి మృతిపై తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ సురేష్ బాబు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి తండ్రి వెంకటేశ్వరరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.